సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం

ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు యలమంచిలిలో నిర్వహించిన ప్రత్యేక శిబిరానికి దివ్యాంగులు పోటెత్తారు. 8లో



హృదయం.. పదిలమేనా?

గుండెపోటు మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. యుక్త వయసులోనే తనువు చాలిస్తున్నారు. అసలు ఎందుకలా..? 8లో



జాషువాకు ఘన నివాళి

విశాఖ: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా విగ్రహానికి పూర్వ వీసీ ఆచార్య జార్జ్ విక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' చర్చా వేదిక నేడు

అనకాపల్లి టౌన్: స్థానిక రింగ్ రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాలులో 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' అంశంపై శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీకి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లాలో పార్టీ అనుబంధ సంస్థల అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, జేఏసీ నేతలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు దేవరాపల్లిలో 'జగనన్నకు చెబుదాం'

దేవరాపల్లి: దేవరాపల్లిలో శుక్రవారం నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా టెంట్ల ఏర్పాటుతోపాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి వి.రవీంద్రనాథ్, తహసీల్దార్ ఎం.లక్ష్మి కోరారు.

రేపు మినీ జాబ్ మేళా

అనకాపల్లిటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 30న వరుణ్ బజాజ్ కంపెనీ మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ విద్యార్హత ఉన్న, 18 నుంచి 25 ఏళ్ల వయసున్న యువతీ, యువకులు జాబ్‌మేళాకు అర్హులన్నారు. మర్ని వివరాలకు 81432 29228,70363 63272 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

నేడు కేంద్ర మంత్రి దర్శన జర్దోష్ రాక

యలమంచిలి: కేంద్ర రైల్వే, టెక్స్‌టైల్స్ శాఖ సహాయ మంత్రి దర్శన విక్రమ్ జర్దోష్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆమె విశాఖపట్నం నుంచి అచ్యుతాపురం సెజ్‌కు చేరుకొని బ్రాండిక్స్ ఇండియా టెక్స్‌టైల్ పార్కుకు వెళతారు. మధ్యాహ్నం 2 గంటలకు యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామంలో పర్యటిస్తారు. అక్కడ ప్రసిద్ధి చెందిన లక్కబొమ్మల తయారీని పరిశీలించి, హస్తకళాకారులతో మాట్లాడతారు.

స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరనిలోటు



- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్: రైతు బాంధవుడు, వ్యవసాయ శాస్త్రజ్ఞుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి పూడ్చలేని లోటని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వామినాథన్ వ్యవసాయం రైతులకు లాభదాయకం కావాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని అనేక నివేదికల ద్వారా దేశాధినేతలకు నివేదించారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయానికి అయిన ఖర్చుతోపాటు 50 శాతం అదనంగా గిట్టుబాటు ధర ఇవ్వాలని స్వామినాథన్ కొన్ని దశాబ్దాలుగా చేసిన పోరాటం ఎప్పటికి నెరవేరుతుందో ఆనాడే వారి ఆత్మకు శాంతి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

విశాఖ జూలో 2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 12 ఏళ్ల లోపు వయసు గల పిల్లలకు జూలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

• ప్రవక్త జీవితం శాంతి సందేశం



నర్సీపట్నంలో ముస్లిం సోదరుల ప్రదర్శన



జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

- భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ
- మసీదు కమిటీల ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ, ప్రత్యేక ప్రార్థనలు

నర్సీపట్నం/కశింకోట: మహమ్మద్ ప్రవక్త (రసూలల్లా సల్లాల్లాహీ అలైహి వసల్లం) జన్మదినమైన మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదు కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల భారీ శాంతి ర్యాలీ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నర్సీపట్నంలో జామియా దర్గా నుంచి పెదబొడ్డేపల్లిలో ఉన్న దర్గా వరకు ముస్లిం సోదరులు ర్యాలీగా తరలివెళ్లారు. మత పెద్ద హుసేన్ మాట్లాడుతూ ఈ పండగ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. మహమ్మద్ ప్రవక్త శాంతి ప్రబోధం విశ్వ మానవాళికి ఆచరణ యోగ్యం అన్నారు. కశింకోట మండల, బయ్యవరంలోని హజరత్ అన్సర్ మద్నీ ఔలియా దర్గా నుంచి కశింకోట వరకు ముస్లింలు, మదని దారుల్ ఉ–వామ్ పాత్రియా ఆశ్వియా మదరసా (పాఠశాల) విద్యార్థులు జెండాలు పట్టుకొని పెద్ద ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కశింకోటలోని హజరత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా దర్గా దర్శించి సలాం (దీవెన) కార్యక్రమం నిర్వహించారు. విందు కార్యక్రమాన్ని జరిపారు.

వాహనమిత్ర నిధుల విడుదల నేడు

- జిల్లాలో ఐదో విడతలో 13,590 మందికి రూ.13.59 కోట్ల లబ్ధి



ఐదో విడత వాహనమిత్రకు అధికారులు ఏర్పాటు చేసిన వేదిక

దేవరాపల్లి: వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఐదో విడత ఆర్థిక సాయం అందించే జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శుక్రవారం దేవరాపల్లిలో నిర్వహించేందుకు ఇన్‌చార్జి ఆర్డీవో మురళీకృష్ణ నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సహా, జిల్లా అధికారులంతా పాల్గొంటారని పేర్కొన్నారు. ఐదో విడతలో జిల్లాలో 13,590 మంది లబ్ధిదారులైన ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేలు చొప్పున, రూ.13.59 కోట్ల మేర నగదు లబ్ధిని వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి, నగదును ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

విడతల వారీగా వైఎస్సార్ వాహన మిత్ర లబ్ధిదారులు, లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నగదు లబ్ధి రూ. కోట్లలో
2019	10,517	10.51
2020	11,221	11.22
2021	10,774	10.77
2022	12,447	12.44
2023	13,590	13.59

కాశ్మీరీ యూత్ ఎక్స్ఛేంజ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: కాశ్మీరీ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం గోడ పత్రికను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తారువలోని తన క్యాంప్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ జె.సుభద్రతో కలిసి గురువారం ఆవిష్కరించారు. భారత ప్రభుత్వ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని జిల్లా యువ కేంద్రం అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సంప్రదాయాలను కాశ్మీర్ యువతకు తెలియజేయడం, వారి ఆచార, వ్యవహారాలను మన యువత తెలుసుకోవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని డిప్యూటీ సీఎంకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు లాలం జానకీరామ్, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత ఆర్.లీలా ప్రసాద్ రెడ్డి, జాతీయ యువ వలంటీర్ గుంపాన గణేష్, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి అవకాశాలు

- విశాఖకు రాజధాని రానుండడంతో మారనున్న దశ
- ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి



డిపో నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం: కణమాం పంచాయతీ గోరింటలో ఎక్సైజ్ శాఖ కాంప్లెక్స్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో నిర్మాణంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి చెప్పారు. ఇక్కడ రూ.20 కోట్లతో నిర్మించనున్న ఎక్సైజ్ శాఖ కాంప్లెక్స్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో నిర్మాణ పనులకు గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడే మరో వంద కోట్లతో డిపోను విస్తరించే అవకాశం ఉండడంతో స్థానికులు ఎంతో లబ్ధి పొందనున్నారని చెప్పారు. విశాఖకు రాజధాని రానుండడంతో గ్రామీణ ప్రాంతాలు ఉపాధి, ఉద్యోగావకాశాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించనున్నాయని చెప్పారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇటీవల ఈ ప్రాంతంలోనే 50 ఎకరాల్లో ఆటోనగర్ నిర్మాణానికి అంకురార్పణ చేశామన్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ భీమిలి అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలోనే విశాఖ రాజధాని ఏర్పాటు కానుండడంతో అన్ని రంగాలలోను అభివృద్ధిని సాధించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు తరలి రానుండడంతో పర్యాటక రంగం అభివృద్ధి చెంది స్థానికంగానే యువతకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజిత్ భార్గవ్, రాష్ట్ర కమిషనర్ వివేక్ యాదవ్, రాష్ట్ర బేవరీస్ కమిషనర్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో మహిళామార్ట్

- అతివలు ఆర్థికంగా ఎదిగితేనే పురోభివృద్ధి
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మహిళా మార్ట్‌లో సరకులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

చోడవరం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబానికి ఆసరాగా నిలవాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేయూత పథకాన్ని అందిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పట్టణంలో డ్వాక్రా మహిళల మండల సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో ఈ మార్ట్‌ను డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రతీ మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందన్నారు. డ్వాక్రా మహిళలంతా కలిసి ఒక మార్ట్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధి కల్పించుకోవడం అభినందనీయమన్నారు. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో డ్వాక్రా సంఘాల ద్వారా అత్యధికంగా మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, ఏరియా కో ఆర్డినేటర్ రత్నప్రభ, ఏపీఎం కనకరాజు, మహిళా మార్ట్ చీఫ్ ప్రమోటర్ ఓబుబోయిన వరలక్ష్మి, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు కామలక్ష్మి, సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.

కుల ప్రాతిపదికన జనగణన సాహసోపేతం

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటన పట్ల సర్వత్రా హర్షం
- మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: కులాల ప్రాతిపదికన జనగణన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం సాహసోపేతమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన జరగాలని స్వాతంత్ర్యం వచ్చిన నుంచి పోరాటాలు చేసినా ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కుల గణన జరిగినపుడే రిజర్వేషన్ అమలు, విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలపై స్పష్టత వస్తుందన్నారు. ప్రజలు ఉద్యమాలు చేస్తే సమస్యను గుర్తించే ప్రభుత్వాల మాదిరిగా కాకుండా తమ ప్రభుత్వం సమస్యను ముందే గుర్తించి దానికి పరిష్కారం చూపుతుందన్నారు. సుమారు వందేళ్ల తర్వాత కులగణన చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలని కోరారు. సమాజంలో అణగారిన వర్గాల వారికి ఈ కులగణన ద్వారా శతశాతం లబ్ధి చేకూరుతుందన్నారు. దామాషా ప్రకారం కులాల వారీగా జనాభాను అంచనా వేస్తున్నారు తప్ప, కులగణన చేపట్టకపోవడంతో సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షేమ ఫలాలు అణగారిన వర్గాలకు అందడం లేదన్నారు. ఇలాంటి తరుణంలో సీఎం జగన్ కులగణనకు ప్రతిపాదించడాన్ని అన్ని వర్గాల ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సువర్ణపాలన సాగుతుందన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాకే అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని జోస్యం చెప్పారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి అప్పారావు, పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, గుంట్ల అప్పారావు, కర్రి పెదబ్బాయి, బొడ్డేడ అప్పలనాయుడులు పాల్గొన్నారు.

దళితవాడలను పంచాయతీలు చేయాలి..

- అప్పుడే మరింత అభివృద్ధి
- అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకుడు, ఫైర్ సర్వీస్ డీజీపీ సునీల్‌కుమార్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీజీపీ సునీల్‌కుమార్

తుమ్మపాల: ఐదు వందల జనాభా కలిగిన ప్రతి దళితవాడను పంచాయతీగా చేసి అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పి.వి.సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలో భీమునిగుమ్మం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అనకాపల్లిలో అడుగుపెట్టి 79 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రైల్వేస్టేషన్ వద్ద గల లక్ష్మి శ్రీనివాస కళ్యాణమండపంలో జిల్లా దళిత ఉద్యోగులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అండేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి దళితుడు పాటుపడాలన్నారు. పంచాయతీల ఏర్పాటు ద్వారా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సద్వినియోగం చేసుకోగలమన్నారు. ప్రతి ఏటా రూ.1600 నుంచి రూ. 2000 కోట్లు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరవుతాయని, వాటిని వినియోగించుకోవడంలో దళితులు దృష్టి పెట్టాలన్నారు. మనం ఎదగాలంటే మనం మారాలని, మన హక్కులను పొందడంలో పట్టు సాధించాలన్నారు. దళితుల ఎదగడానికి వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వాలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదని, దళితుడైన డాక్టర్ జీవితాంతం ఉద్యోగం చేయడం తప్ప ఆసుపత్రి నిర్మించే స్థాయికి చేరలేకపోతున్నారన్నారు. డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు, ఎయిమ్స్ జిల్లా నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాలీబాల్ పోటీలు, ఎంపికలు వాయిదా

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా సారథ్యంలో ఈనెల 29వ తేదీన పాడేరులోని తలారిసింగ్ క్రీడా మైదానంలో నిర్వహించాల్సిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వాలీబాల్ (అండర్–14) పోటీలు, ఎంపికలు వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసినట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి, విశాఖ, ఏఎస్‌ఆర్ జిల్లాల కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, ఎం.వి.నాగేశ్వరరావు, పి.సూరిబాబు తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, ఉమ్మడి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలని వారు కోరారు.

వెయ్యి లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



పులుపు ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ

రావికమతం: మండలంలోని కొంట్యాబిల్లి కొండపై సారా తయారీకి నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం పులుపుతోపాటు సామగ్రిని ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామ సమీపంలోని కొండపై పెద్ద ఎత్తున సారా తయారీ చేస్తున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. అక్కడ పెద్ద ఎత్తున డ్రమ్ములతో పులుపు లభ్యమవ్వగా ధ్వంసం చేసి పాత్రలను దహనం చేశామన్నారు.

పాముకాటుతో పాడిరైతు మృతి

అనకాపల్లి టౌన్: మండలంలో మారేడుపూడి పంచాయతీ గున్నవానిపాలేనికి చెందిన వాకాడ రమణ(44) పాము కాటుతో మృతి చెందినట్లు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ నర్సింగరావు గురువారం చెప్పారు. బుధవారం రాత్రి తన పశువులకు మేత వేసేందుకు వెళ్తుండగా పాము కాటు వేసిందన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం



గుర్తింపు శిబిరానికి తరలివచ్చిన వికలాంగులు (ఇన్‌సెట్) యలమంచిలిలో దివ్యాంగుల గుర్తింపు శిబిరాన్ని సందర్శించిన ఎంపీ బీవీ సత్యవతి

- ఉపకరణాల మంజూరు గుర్తింపు శిబిరంలో ఎంపీ సత్యవతి
- అధిక సంఖ్యలో తరలివచ్చిన దివ్యాంగులు

యలమంచిలి: దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. దివ్యాంగులు దైనందిన జీవితంలో పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం యలమంచిలి శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ, ఆలిమ్‌కో సంస్థ సంయుక్త సహకారంతో నిర్వహించిన దివ్యాంగుల గుర్తింపు శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో దివ్యాంగుల దరఖాస్తు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఉపకరణాల ద్వారా దివ్యాంగుల జీవన విధానానికి సహాయ పడేలా ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వికలాంగుల దైనందిన జీవితాలపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించి, సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు పంపడంతో దివ్యాంగులకు ఉపకరణాలు అందించే శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

తన ఎంపీ నిధులు నుంచి వికలాంగుల ట్రైసైకిళ్లకు రూ.12 వేలు చొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు అనకాపల్లి, చోడవరంలో ఈ శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ గుర్తింపు శిబిరంలో దివ్యాంగులు తమ జీవితంలో ఉపాధి పొందే విధంగా వారికి ఆసక్తి కలిగిన రంగాల్లో రాణించేలా, వారి అర్హతలు, ఆసక్తి ఆధారంగా ఆయా రంగాల్లో శిక్షణనిచ్చి, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. శిబిరంలో దివ్యాంగుల యూడీఐడీ గుర్తింపు కార్డులను నమోదు చేసి, అవసరమైన సహాయక పరికరాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు జాయింట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ ఎంపీ సత్యవతి, జిల్లా కలెక్టర్ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నేతృత్వంలో 26వ తేదీ నుంచి 3 రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఈ గుర్తింపు శిబిరాలు నిర్వహిస్తున్నామని, దివ్యాంగులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, యలమంచిలి మున్సిపాలిటీ, యలమంచిలి రూరల్, రాంబిల్లి, మండలాల నుంచి అధిక సంఖ్యలో దివ్యాంగులు తరలివచ్చి, తమ వివరాల ఆధారంగా వైద్య పరీక్షలు చేయించుకుని, పేర్లను నమోదు చేసుకున్నారు. మొత్తం 1,100 మంది దరఖాస్తు చేసుకోగా 450 మంది ఉపకరణాలు పొందేందుకు అర్హులుగా తేలారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జగదీష్, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, ఎంపీడీవో అప్పలనాయుడు, మండల ఏవో దేవీప్రసాద్, తహసీల్దారు రాణీ అమ్మాజీ, మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రూరల్ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కౌన్సిలర్లు, వెలుగు ఏపీఎం రాణి, మెప్మా అధికారులు, ఏఎస్ఎంలు, వెలుగు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్‌ఐ రిక్రూట్‌మెంట్ కొలతల్లో సాంకేతిక తప్పిదం

- న్యాయం చేయాలంటూ రిక్రూట్‌మెంట్ బోర్డుకు అభ్యర్థి ఫిర్యాదు



ఫిర్యాదు కాపీతో వర్మగాంధీ

రావికమతం: మొదటి సారి ఎంపిక కాలేదన్న పట్టుదలతో చదివి రెండో పయత్నంలో అన్ని టెస్టుల్లో పాసైనా శరీర ఎత్తు కొలతల్లో సాంకేతిక తప్పిదం వల్ల తాను ఎస్‌ఐ ఉద్యోగానికి అర్హత కోల్పోతున్నానని మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన ఉద్యోగార్థి పూతి వర్మగాంధీ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ మేరకు తన శరీర పొడవు మూడు దఫాలు వేర్వేరు కొలతలుగా చూపిన విధానంపై పరిశీలించి న్యాయం చేయాలంటూ విజయవాడ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు గురువారం ఫిర్యాదు పత్రం పంపాడు. దివ్యాంగుడైన పూతి అప్పారావు కుమారుడు వర్మగాంధీ బీటెక్ చదివాడు. ఎస్‌ఐ ఉద్యోగంపై మక్కువతో పట్టుదలగా చదివి 2018లో రిక్రూట్‌మెంట్‌కు హాజరయ్యాడు. శరీర కొలతల్లో పొడవు 167.6, ఛాతి 86.3, శ్వాస పీల్చినప్పుడు 5 సెంటీమీటర్లు పెరగడం అన్నీ సెన్సార్ మెషీన్‌తో సరిచూడగా సరిపోయాయి. రాత పరీక్షలో మాత్రం ఫెయిలయ్యాడు. అయినప్పటికీ నిరాశ చెందకుండా విజయనగరంలో కోచింగ్ తీసుకుని మరింత పట్టుదలతో చదివి తాజాగా ఇటీవల నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష పాసయ్యాడు. శరీర దారుఢ్య పరీక్షలకు ఈ నెల 21న హాజరు కాగా, శరీర పొడవు 167 సెంటీమీటర్లుగా నిర్ధారించారు. గతంలో 167.7గా వచ్చిందని, వాస్తవంగా తన పొడవు అంతేనని, అప్పటి పత్రాలను చూపి మరొక్కమారు సరి చూడాలని, అప్పీలు చేసుకోగా మరలా శరీర కొలతలు తీశారు. మూడో దఫాలో 167.2 సెంటీమీటర్లుగా వచ్చిందని డిస్క్వాలిఫై చేశారు. శరీర కొలతల్లో సాంకేతిక లోపాల కారణంగా తనకు అన్యాయం జరిగిందని, దీని వల్ల మానసికంగా తాను, తన కుటుంబ సభ్యులు కుంగిపోతున్నామని పునః పరిశీలించి తగిన న్యాయం చేయాలని ఆ ఫిర్యాదులో బాధితుడు కోరాడు.

డైట్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా




మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్: స్థానిక డైట్ కళాశాలకు 2023–24 విద్యా సంవత్సరం నుంచి పదేళ్ల పాటు యూజీసీ (2032–33) నుంచి స్వయం ప్రతిపత్తి హోదా దక్కిందని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. స్థానిక కళాశాల ఆవరణలో గురువారం ఆయన మాట్లాడారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్‌కు 5,543 విశ్వవిద్యాలయాలు, కళాశాలలు పోటీపడగా, అందులో డైట్ కళాశాల ప్రతిష్టాత్మకమైన 151–300 బ్యాండ్ ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించుకుందన్నారు. ఈసీఈ, సీఎస్ఈ విభాగాల్లో జేఎన్‌టీయూ రీసెర్చ్ సెంటర్ అనుమతి లభించిందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

హృదయం.. పదిలమేనా?

- ఆందోళన కలిగిస్తున్న గుండెపోటు మరణాలు
- యుక్త వయసులోనే తనువు చాలిస్తున్న పలువురు
- జీవనశైలి, ఆహారంలో మార్పులే కారణమంటున్న వైద్యులు



కేజీహెచ్‌లో కార్డియాలజీ విభాగం

మహారాణిపేట (విశాఖ): జీవన శైలిలో మార్పులు, అధిక బరువు, రక్తపోటు, మధుమేహం తదితర సమస్యలతో గుండె లయ తప్పుతోంది. నిమిషానికి 72 సార్లు కొట్టుకోవాల్సిన హృదయం కొన్ని సార్లు మొరాయిస్తోంది.. మరికొన్ని సార్లు అతివేగంగా కొట్టుకుంటోంది. గతంలో 45 ఏళ్లు దాటాక గుండె పోటు వచ్చేది. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా వచ్చే వ్యాధుల్లో ఎక్కువగా గుండె పోటు పేరే వినిపిస్తోంది. ఈ రోజు హార్ట్ డే. గుండెను ఎంత ప్రమాదంలోకి నెడుతున్నామో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

కేజీహెచ్‌లో 24×7 సేవలు

కేజీహెచ్‌లో రెండు కార్డియాలజీ యూనిట్లు ఉన్నాయి. మొదటి యూనిట్ విభాగాధిపతిగా డాక్టర్ బి.ఆదిలక్ష్మి, రెండో యూనిట్ విభాగాధిపతిగా డాక్టర్ మల్లాది శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. వీరికి అసోసియేట్ ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సహాయంగా ఉంటున్నారు. ఐసీయూలో 13 పడకలు ఏర్పాటు చేశారు. కార్డియాలజీ ఓపీకి ప్రతి రోజూ 200 నుంచి 300 మంది రోగులు వస్తుంటారు. ఇక్కడ నెలకు 100 ఎంజియోగ్రామ్, 40 స్టంట్‌లు, 30 తాత్కాలిక పేస్ మేకర్లు, 15 శాశ్వత పేస్‌మేకర్లు ఉచితంగా అమర్చుతున్నారు. వేల రూపాయల్లో ఉండే మందులు, ఇంజక్షన్లను రోగులకు ఉచితంగా ఇస్తున్నారు. గుండెకు నీరు చేరడం, గుండెకు కన్నం పడడం తదితర సమస్యలకు కూడా ఇక్కడ వైద్య సేవలందిస్తున్నారు.

ఒత్తిడికి గురికావద్దు



ప్రతీ మనిషి జీవితంలో ఒత్తిడి సహజం. ఒత్తిడిని నియంత్రించడం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చు. ఇందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ధాన్యం, యోగా వంటివి ఉపయుక్తంగా నిలుస్తాయి. గతంలో పోలిస్తే యువకుల్లో గుండె పోట్లు పెరుగుతున్నాయి. కరోనా తర్వాత అవి మరింత ఎక్కువయ్యాయి. రాత్రి నిద్ర తక్కువ పోవడం వల్ల పగలు ఒత్తిడి పెరుగుతుంది. కనీసం రోజుకు 6–7 గంటలు నిద్రపోవాలి. 45 నిమిషాలు నడవాలి. గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి. – ప్రొఫెసర్ ఆదిలక్ష్మి, కార్డియాలజీ విభాగం, కేజీహెచ్

ఆహార నియమాలతో వ్యాధులు దూరం



గుండెపోటుకు ఎంత త్వరగా చికిత్స ఆరంభిస్తే అంత మంచిది. గుండె పోటుతో రక్తం సరఫరా నిలిచిపోయినప్పుడు ఈ భాగంలోని కండరం దెబ్బతిని చివరికి చచ్చుబడుతుంది. ఈ లోపు చికిత్స మొదలు పెడితే కండరం దెబ్బతినకుండా, సమస్య తీవ్రం కాదు. గుండె, రక్తనాళాల సంబంధిత వ్యాధులను 80 శాతం వరకు నివారించవచ్చు. ఏదైనా అతిగా చేయడం వల్ల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. మద్యంగానీ, ఆహారం గానీ అతిగా తీసుకోవడం వల్ల ఆ ప్రభావం గుండె మీద పడుతుంది. – డాక్టర్ ఎస్.సి.సిన్హా, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, స్టార్ పినాకిల్ హార్ట్ సెంటర్

పరిమళించిన మానవత్వం



రూ.15 వేల సాయం అందిస్తున్న ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ యూత్ సభ్యులు



రూ.5 వేల సాయం అందిస్తున్న సర్పంచ్ లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ప్రమాద బాధితుడికి దాతల ఆర్థిక సాయం

రావికమతం: వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన కొత్తకోటకు చెందిన పడమటి శ్రీనివాసరావుకు పలువురు దాతలు అండగా నిలుస్తూ తమ ఉదారత చాటుకుంటున్నారు. శ్రీనివాసరావు తల్లి కూడా హృద్రోగ సంబంధిత సమస్యతో మంచం పట్టడం, వృద్ధ తండ్రి దిక్కుతోచని స్థితిలో ఉండటంపై 'అనుకోని ప్రమాదం అంతులేని ఆవేదన' శీర్షికన సాక్షిలో ఈ నెల 25న ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు మానవత్వంతో స్పందిస్తున్నారు. గురువారం కొత్తకోట గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ యూత్ సభ్యులు రూ.15 వేలు, చికెన్ వ్యాపారి ఆర్.వి.రెడ్డి రూ.5 వేలు, గ్రామ సర్పంచ్ లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్రావు, దొర, పాండు రూ.5 వేలు, కొత్తకోట హైస్కూల్ ఆఫీసు సబార్డినేట్ పి.సూర్యమణి నిత్యావసర సరకులతోపాటు రూ.వెయ్యి సాయాన్ని అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేడు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజనసభ

- సభకు భారీ ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు

చోడవరం: గోవాడ ఫ్యాక్టరీ సభ్య రైతుల మహాజన సభను ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నారు. ఫ్యాక్టరీ మెయిన్‌గేటు ఆవరణలో మహాజనసభ నిర్వహణకు ఫ్యాక్టరీ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సభకు వేలాదిమంది సభ్య రైతులు హాజరుకానున్నారు. పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా కలెక్టర్ రవిపట్టాన్ శెట్టితోపాటు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పలువురు ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనున్నారు. 24వేల మంది సభ్యరైతులు ఉండడంతో కనీసం 10వేల మంది అయినా ఈ సభకు వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా కుర్చీలు, సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఈ సభలో రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేయడంతో పాటు ఫ్యాక్టరీలో జరుగుతున్న అవకతవకలపై నిలదీసేందుకు సభ్య రైతులు సిద్ధమయ్యారు. ప్రధానంగా 2022 –23 సీజన్‌కు సంబంధించి ఇంకా రైతులకు రావాల్సిన రూ.10 కోట్ల చెరకు బకాయిల గురించి సభ దృష్టికి తీసుకురానున్నారు. మరోపక్క తొమ్మిదేళ్ల కిందట హుద్‌హుద్ తుపాన్‌లో జరిగిన అవకతవకలపై విచారణ నివేదిక వివరాలపైన, 2019లో మొలాసిస్ అమ్మకాల్లో జరిగిన ఆరోపణపై కూడా ఈ సభలో మరోసారి యాజమాన్యాన్ని నిలదీసేందుకు వాటి నివేదికలు సభ ముందు ఉంచేందుకు రైతులు పట్టుబట్టే అవకాశముంది.

రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరి మృతి



మృతుడు చింతల లోవరాజు(ఫైల్)

యలమంచిలి : ఇరుకు రోడ్డుపై మితిమీరిన వేగంతో ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఒక దానినొకటి ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఏటికొప్పాక గ్రామ పంచాయతీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఆదే గ్రామానికి చెందిన చింతల లోవరాజు(40) తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు అతడిని చికిత్స నిమిత్తం యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ములకలాపల్లి మైహోం సిమెంటు కర్మాగారంలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. కర్మాగారంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాసేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన లోవరాజు ఊహించని విధంగా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇదే ప్రమాదంలో మరో ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. లోవరాజు మృతదేహాన్ని యలమంచిలి మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు యలమంచిలి రూరల్ పోలీసులు తెలిపారు.

దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలి

- రాష్ట్ర టెన్నికాయిట్ క్రీడాకారులకు వీడ్కోలు



క్రీడాకారులతో పీజేవీఆర్ నాయుడు

అనకాపల్లి టౌన్: ప్రపంచ ఐదో టెన్నికాయిట్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ క్రీడా ప్రతిభ ప్రదర్శించి దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ చైర్మన్ పి.జి.వి.ఆర్. నాయుడు ఆకాంక్షించారు. దక్షిణాఫ్రికాలో ఈ నెల 29 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రం నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఆయన వీరిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ క్రీడా ప్రాధికారిక సంస్థ తగిన ప్రోత్సాహాన్ని అందివ్వాలని కోరారు. విజయనగరం జిల్లా చీపురపల్లి గ్రామానికి చెందిన మౌనిక, పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన హేమామాధురి, తూర్పు గోదావరి జిల్లా మండపేట గ్రామానికి చెందిన రామారావు, వినయ్‌కుమార్‌లకు ఘన వీడ్కోలు పలికారు. గురువారం విశాఖ నుంచి హైదరాబాద్ మీదుగా బొంబాయి చేరుకుని, శుక్రవారం అక్కడ నుంచి దక్షిణాఫ్రికాకు క్రీడాకారులు వెళ్తారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఎస్.వి. సత్యనారాయణ, కోచ్‌లు కె.ఆర్.వి.శ్యాంసుందర్, మురళీ పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ రమేష్ కుమార్ సుమన్



మాట్లాడుతున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ రమేష్ కుమార్ సుమన్

అనకాపల్లి రూరల్: జీవ వైవిధ్య పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ రమేష్ కుమార్ సుమన్ అభిప్రాయపడ్డారు. మండలంలోని తుమ్మపాల శారదావేలీ అభివృద్ధి సమితి ట్రైనింగ్ హాలులో గురువారం జరిగిన ఇంటెన్సివ్ కోర్ కార్యకలాపాల కార్యాచరణ ప్రణాళిక అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవ వైవిధ్య సంరక్షణకు కృషి చేస్తున్న వివిధ ఎన్‌జీవో సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. జీవ వైవిధ్య సంరక్షణ మానవాళి మనుగడకు ఎంతో ముఖ్యమన్నారు. వన్యప్రాణులు, వివిధ రకాల ఔషధ మొక్కలను కాపాడుకోవాలన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యకలాపాల విజయవంతానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా నీటి వనరుల సంరక్షణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన చేపట్టాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలను భాగస్వామ్యం చేసుకుని విద్యార్థుల్లో చైతన్యం తేవడానికి కృషి చేస్తే కార్యక్రమాలు మరింత విజయవంతమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌బీబీ ప్రాంతీయ సమన్వయకర్తలు, వివిధ ఎన్‌జీవో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు

పాయకరావుపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన అండర్ –19 బాలుర, బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల నుంచి బాలికల జట్టుకు ఐదుగురు, బాలుర జట్టుకు పది మంది ఎంపికయ్యారు. త్వరలో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున వీరు పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్ భానుమూర్తి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్‌ప్రకాష్, కోచ్‌లు సురేష్, బాలరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గబాబు తదితరులు అభినందించారు.

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాల్ బ్యాడ్మింటన్ అండర్– 17 విభాగంలో ఎం. శరణ్యశ్రీ లక్ష్మి, టి. రుషితదేవి, టెన్నికాయిట్‌లో అండర్– 14 విభాగంలో టి. విజయదుర్గ ఎంపికయ్యారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట హైస్కూలులో బాల్ బ్యాడ్మింటన్, పెద ముషిడివాడలో టెన్నికాయిట్ పోటీలను ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించగా వీరు ఎంపికయ్యారు. వీరిని విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల కాసులమ్మ, హెచ్ఎం పి. శ్రీనివాసరావు, పీడీ జి. నూకరాజు, స్కూలు కమిటీ చైర్మన్ ప్రకాశరావు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

ఎస్.రాయవరం: స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ శ్రీనివాస్ గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పోటీలు విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న నిర్వహించారన్నారు. ఇందులో అండర్ –14 విభాగంలో కె.శిరీష, టి. ఎస్.వి.దుర్గ, ఇ.వైష్ణవి, జి.వాహిని, బాలుర విభాగంలో కె.నందకిషోర్ ఎంపికైనట్టు తెలిపారు. వీరిని హెచ్ఎం సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో మరిడిమాంబ



అనకాపల్లిటౌన్: గవరపాలెం శ్రీ మరిడిమాంబ అమ్మవారి దేవాలయంలో నెల పండగ పురస్కరించుకుని గురువారం అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బుద్ధ కృష్ణారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ కె.ఎం.నాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ, కోశాధికారి కాండ్రేగుల శ్రీనివాసరావు, సభ్యులు బొడ్డేడ లక్ష్మీనరసింహం, కర్రి సూరిబాబు, పీలా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎన్ఆర్ పేట రామాలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి సూరం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. వ్రతాలు చేయించుకునే భక్తులు ముందుగా ఆలయం వద్ద ఉచితంగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వ్రతం అనంతరం స్వామివారి ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

గణనాథునికి దీపారాధన



దీపారాధనలో భక్తులు

అనకాపల్లిటౌన్: మండలంలోని గుండాలవీధిలో బెస్ట్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణపతి చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామివారి మండపం వద్ద గురువారం సాయినగర్ భక్తులు దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాలమరశెట్టి కృష్ణ, రాంబాబు, వెంకటేష్, రమణబాబు, రాజు, లీల పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

పెదకాపు	: రాజా
స్కంద	: సత్యనారాయణస్క్రీన్-1
సప్త సాగరాలు దాటి	: సత్యనారాయణస్క్రీన్-2
జవాన్ (మార్నింగ్, మ్యాట్నీ)	
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: షిర్డిసాయి
స్కంద	: పర్తిసాయి
ఖుషి	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
చంద్రముఖి 2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 302 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,430	4,430
రెండో రకం	4,030	4,340
మూడోరకం	3,700	4.020

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-27 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

కశింకోట.. అభివృద్ధి బాట

- నాలుగున్నరేళ్లలో రూ.2 కోట్లతో అభివృద్ధి
- సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంలో ముందంజ

ప్రతి గ్రామంలో ప్రధాన సమస్య రోడ్లు, డ్రైనేజీలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రోడ్లు పటిష్టంగా తయారయ్యాయి. అన్ని గ్రామాల్లోనూ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నారు. మేజర్ పంచాయతీ కశింకోటలో సుమారు రూ.2 కోట్ల మేర నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. మంత్రి అమర్‌నాథ్ చొరవతో కశింకోట అభివృద్ధి పథాన దూసుకెళ్తోంది.

కశింకోట: స్థానిక కశింకోట పంచాయతీ పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించి అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాన వీధులే కాకుండా, చిన్న చిన్న వీధు(సందు)ల్ని కూడా సిమెంట్ రోడ్లుగా మార్చారు. వీటిని మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఇంకా పలుచోట్ల రోడ్లు, కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మంత్రి కృషితో నిధుల మంజూరు

కశింకోట పంచాయతీ పరిధిలో సుమారు 20 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. అనకాపల్లి నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీల్లో ఇది ఒకటి. ఇక్కడ నాలుగు సచివాలయాలున్నాయి. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచీ కశింకోట అభివృద్ధికి అమర్‌నాథ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మరింత వేగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు రప్పించడంతోపాటు, జెడ్పీ, గడప గడపకు మన ప్రభుత్వం(జీజీఎంపీ) నిధులు మంజూరు చేయించారు. ఎంపీ బీవీ సత్యవతి కూడా ఎంపీ నిధులు కేటాయించి, అభివృద్ధికి తోడ్పడ్డారు. దీంతో ప్రధాన వీధులతోపాటు చిన్న వీధుల్లో కూడా సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించి అభివృద్ధి చేస్తున్నారు.

అభివృద్ధి బాటలు

గత నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్లకు పైబడి నిధులు వెచ్చించి సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారు. కస్పావీధి, కుమ్మరి వీధి, గాడి వీధి, గవరపేట, కనకమహాలక్ష్మి వీధి, హౌసింగ్ కాలనీ, పూసర్ల వీధి, అఫీషియల్ కాలనీ, రౌతు వీధి, గోలి వీధి, మేదర వీధి తదితర ప్రాంతాలు సిమెంట్ రోడ్లతో కళకళలాడుతున్నాయి. తాజాగా రూ.80 లక్షల విలువైన సిమెంట్ రోడ్లు, కాలువలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఎంపీ నిధులతో హౌసింగ్ కాలనీకి జాతీయ రహదారి నుంచి సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఇంకా పలుచోట్ల సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సీసీ రోడ్డు అనంతరం నిర్మిస్తున్న డ్రైనేజీ



చిన్న వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు



గవరపేట పెద్దగుమ్మం వీధిలో నిర్మించిన ప్రధాన రోడ్డు

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

పంచాయతీ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో రూ.2 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం. సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణంతో మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు తీసుకున్నాం. జిల్లా పరిషత్, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పాటు మంత్రి చొరవతో వచ్చిన ఇతర నిధులనూ వినియోగించాం. మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించి, ప్రజల వినియోగంలోకి తీసుకొచ్చాం.

–వేణుగోపాలరావు, డీఈ, పంచాయతీ రాజ్ శాఖ

ఘనంగా దుర్గమాంబ పుట్టుక మహోత్సవం



పల్లకిలో దుర్గమాంబ అమ్మవారి ఊరేగింపు



దుర్గమాంబ ఊరేగింపులో థింసా కళాకారులతో స్థానిక యువత

కశింకోట: కశింకోటలోని గవరపేటలో వెలసిన దుర్గమాంబ అమ్మవారి పుట్టుక మహోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి గరగలను అందంగా పూలతో అలంకరించిన పల్లకిలో డప్పులు, వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. స్థానిక కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వెనుక ఉన్న దుర్గమాంబ పుట్ట వద్దకు తీసుకెళ్లారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఊరేగింపుగా వచ్చిన ప్రజలు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతి రూపాన్ని పల్లకిలో చేర్చి, గ్రామంలో ఊరేగించారు. మహిళల కోలాటాలు, తోడపెద్దు సేవలు, భజనలు, నృత్యాలతో రాత్రి గ్రామం అంతటా తిప్పారు. ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ కమిటీ అధ్యక్షుడు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.

వినాయక ఉత్సవాలతో యువతలో భక్తిభావం



ప్రథమ బహుమతి అందుకున్న వేల్పులవీధి సిద్ధు బెస్ట్‌ఫ్రెండ్స్‌తో కుమారస్వామి

అనకాపల్లిటౌన్: చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరిలో భక్తిభావం పెంచే గణపతి నవరాత్రుల్ని వేడుకగా నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గణేష్ నవరాత్రి వేడుకలతో యువతలో ఆధ్యాత్మిక చింతన కలిగిస్తున్న కమిటీ సేవల్ని ప్రశంసించారు.

వేల్పులవీధిలో ఏర్పాటు చేసిన గణపతికి ప్రథమ బహుమతి, మల్టీ గైస్ జగన్నాథ థియేటర్ వద్దనున్న విగ్రహానికి ద్వితీయ, చేపల బజారులో మిరాకిల్ బాయ్స్ ఏర్పాటు చేసిన గణపతికి తృతీయ బహుమతి ప్రకటించారు. కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, అర్రెపు కామేష్, కొమ్మోజు రమేష్, రేబాక మధు, మళ్ల సూరిబాబు, మళ్ల భోగలింగం, బి.భాస్కర్ పాల్గొన్నారు.

- పట్టణంలోని ఆశీలమెట్టకాలనీలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక అర్చనలు జరిగాయి. భారీ ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



కొత్తపల్లిలో ఎంఎల్‌హెచ్‌పీ దివ్య ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు




బుచ్చియ్యపేటలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న ఉమ

కశింకోట: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే మరో మూడు సచివాలయాల పరిధిలో తాజాగా ప్రారంభించి, గురువారం ముమ్మరంగా నిర్వహించారు. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తేగాడ, కొత్తపల్లి, తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలోని ఏఎస్ పేట సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు సేకరించారు. పేరంటాలపాలెం, బుచ్చియ్యపేట గ్రామాల్లో కూడా సర్వే జరుపుతున్నారు. ఆయా సచివాలయాలతోపాటు కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, చింతలపాలెం సచివాలయాల పరిధిలో ముందుగా ప్రారంభించిన సర్వే జోరుగా జరుగుతోంది. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సర్వేలో పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవాలు



కశింకోటలో వినాయక నిమజ్జన ఊరేగింపులో మహిళలు, యువతుల ఆనంద హేల



వాసవీనగర్ శ్రీవరసిద్ధి వినాయకుడు

కశింకోట: కశింకోటలో గురువారం కూడా పలు వినాయక విగ్రహాలకు నిమజ్జనోత్సవాలు జరిగాయి. స్థానిక పొట్టి శ్రీరాములు పార్కు, గోవిందరావు కాలనీ, కస్పావీధి ప్రాంతాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, నృత్యాలు, బాణసంచా వెలుగులతో గ్రామంలో ఊరేగించి శారదానదిలో నిమజ్జనం చేశారు. బుధవారం మొదలైన నిమజ్జనోత్సవాలు పెద్దగుమ్మం వీధి దరి శారదానదిలో గురువారం తెల్లవారుజాము వరకూ జరిగాయి. ఉత్సవాల్లో యువతీ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తుమ్మపాల: అనకాపల్లి మండలం గొలగాం వాసవీ నగర్ లక్ష్మీగణపతి ఆలయంలో శ్రీవరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి, నిమజ్జనం చేశారు.

ఆలయ అర్చకుడు జగన్నాథశర్మను కమిటీ సభ్యులు సత్కరించి ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రదీప్, సునీల్, ఈశ్వరరావు, భాస్కరరావు, గోకివాడ రమణ పాల్గొన్నారు.

శ్రీధర్ మాస్టారుకు సత్కారం



మాస్టారిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: సమాజంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను మానవతా దృక్పథంతో చేసిన వారికి గుర్తింపు ఉంటుందని తుమ్మపాల వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ అన్నారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ పరిధి చిన్నబాబు కాలనీలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌ను ఆయన స్వగృహంలో క్లబ్ సభ్యులు గురువారం శాలువాతో సత్కరించారు. 15 ఏళ్లగా పర్యావరణ పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవల్ని కొనియాడారు.

రైళ్లలో సీనియర్ సిటిజన్లకు రాయితీలు పునరుద్ధరించాలి

అనకాపల్లిటౌన్: రైళ్లలో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు రాయితీలను పునరుద్ధరించాలని ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. భారత ప్రభుత్వం కరోనా విపత్తుల సమయంలో సీనియర్ సిటిజన్లకు ఇస్తున్న రాయితీలన్నీ నిలిపేశారని తెలిపారు. ఏడాదికి రెండు, మూడుసార్లు రైల్లో ప్రయాణించే వృద్ధులకు రాయితీలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దేశంలో అన్ని రాజకీయ పార్టీలు సీనియర్ సిటిజన్ల సమస్యలపై పోరాడాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లిటౌన్: విద్యుత్ వైర్ల కింద జంగిల్ క్లియరెన్స్, మరమ్మతు పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు కశింకోట డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మండలంలోని కూండ్రం, కుంచంగి, కొత్తూరు, రొంగలివానిపాలెం, వేటజంగాలపాలెం, సంపతిపురంతోపాటు కశింకోట సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

కోలాటం బృందానికి చీరల పంపిణీ

కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామంలో కోలాట బృందానికి గురువారం చీరలు పంపిణీ చేశారు. సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ మహిళలు తమ పిల్లలకు కోలాటాలు నేర్పించడం అభినందనీయమన్నారు. శ్రీనివాసరావును స్థానిక పెద్దలు శాలువాతో సత్కరించారు.

లక్ష్మీ గణపతికి ప్రత్యేక హోమాలు

అనకాపల్లిటౌన్: మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అనకాపల్లి వినాయక మాలాధారణ కమిటీ సభ్యుడు, గురుస్వామి మళ్ల సురేంద్ర అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో గురువారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి నవరాత్రులను పురస్కరించుకుని 150 మంది వినాయక మాలాధారణ చేసినట్లు తెలిపారు. మాలాధారణ చేసిన భక్తులకు నవరాత్రులు దాతల సహకారంతో దేవాలయ ఆవరణలో ఉచిత భోజనం, అల్పాహారం అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ పురోహితుడు సుబ్రహ్మణ్యంశాస్త్రి, కమిటీ సభ్యులు పొలిమేర ఆనంద్‌కుమార్, యల్లపు నూకరాజు, కర్రి దుర్రి నాయుడు, చక్రవర్తి, త్రినాథ్, బుద్ధ భూలోకనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం



సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనకాపల్లి రూరల్: బ్రిటీష్ పాలన నుంచి భరతమాత దాస్య శృంఖలాలు తెంచేందుకు అతి చిన్న వయసులోనే ప్రాణాలు అర్పించిన వీర యోధుడు భగత్‌సింగ్ అని ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు కొనియాడారు. గురువారం భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా పట్టణంలో సీపీఐ కార్యాలయం, గుండాల కూడలి బీసీ హాస్టల్‌లో వేడుకలు నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో భగత్ సింగ్ పోరాటాన్ని గుర్తు చేశారు. ఆయన ఆలోచనలు, ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. బీసీ హాస్టల్ విద్యార్థులకు భగత్‌సింగ్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ప్రభుత్వాలు భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనకాపల్లి వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమాధికారి సురేష్, విద్యార్థి సంఘ నాయకులు ఎస్.రమణ, గొర్లి తరుణ్, నీరజ, శ్రావణి, గాయత్రి, వెంకటకుమారి, సత్యారావు, రాజేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

అనకాపల్లిటౌన్: మహమ్మద్ ప్రవక్త జయంతి మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని స్థానిక జామియా మసీదులో గురువారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త జయంతి సందర్భంగా శుక్రవారం మసీదు నుంచి నెహ్రూచౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు మసీదు ప్రతినిధులు తెలిపారు.

కశింకోట: మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల(మిలాద్ ఉన్ నబీ)ను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బయ్యవరంలోని హజరత్ అన్సర్ మద్నీ ఔలియా దర్గా నుంచి కశింకోట వరకు ముస్లింలు, మద్నీ దారుల్ ఉ-వామ్ పాత్రియా అశ్వియా మదరసా(పాఠశాల) విద్యార్థులు జెండాలు పట్టుకుని భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కశింకోటలోని హజరత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా దర్గా దర్శించి సలాం(దీవెన) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విందు జరిపారు. కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ అలీ, గురువు జాఫర్ పర్వాజ్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ హక్, మసీద్ ప్రతినిధులు మహమ్మద్ మగ్ బూల్, మహమ్మద్ ముస్లిం, సయ్యద్ అక్బర్ అలీ, బయ్యవరానికి చెందిన బాబర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

కశింకోట: స్థానిక సెంటినరీ బాప్టిస్టు చర్చి 119వ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 500 మంది రోగులకు సేవలందించారు. సత్యదేవ్ ఆస్పత్రి అధినేత, వైద్యుడు బొడ్డేడ లక్ష్మీనరసింహారావు శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు సురేష్‌కుమార్, బొడ్డేడ ప్రియాంక, ఆళ్ల వసంతకుమార్, యేసు ప్రసాద్ రోగులను పరీక్షించి మందులు అందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాస్టర్ సన్నీజేమ్స్, ప్రతినిధులు మంత్రి మోజెస్, కోట నాగేశ్వరరావు, మంత్రి పీటర్ వైజ్‌మెన్, కోట డేవిడ్, దిమ్మల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

అనకాపల్లిటౌన్: ప్రధాని మోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ నేతలు మండలంలోని తుమ్మపాల గ్రామంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 150 మంది రోగులు హాజరుకాగా, శంకర్ ఫౌండేషన్ వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.వి.సత్యనారాయణ, అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు పార్టీ స్థానిక నేతలు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు



కశింకోటలో ఎండ తీవ్రతతో గొడుగుల నీడలో వారపు సంత

కశింకోట: కశింకోటలో గురువారం వేసవిని తలపిస్తూ ఎండ తీవ్రంగా కాసింది. ప్రజలు తక్కువగా రావడంతో సంత వెలవెలబోయింది. వర్తకులు గొడుగుల నీడలో దుకాణాలు నిర్వహించి, అమ్మకాలు సాగించారు. సాయంత్రం వాతావరణం చల్లబడటంతో ప్రజలు తరలివచ్చి ముమ్మరంగా కూరగాయలు, వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, పూజా సామగ్రి కొనుగోలు చేశారు. కూరగాయలు ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో టమాటా, బంగాళాదుంప రూ.20, ఉల్లిపాయ రూ.30, బెండకాయ, వంకాయ, గోరు చిక్కుడు రూ.40, బీరకాయ రూ.50, బీట్రూట్, క్యారెట్ రూ.60, చేమదుంప రూ.80కి విక్రయాలు సాగాయి.

వినాయక విగ్రహ రూపకర్తకు సత్కారం



వినాయక శిల్పి సాయితేజ దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: ఔత్సాహిక శిల్ప కళాకారులను ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. పట్టణంలో వన్ వే ట్రాఫిక్ జంక్షన్ వద్ద వినాయక నవరాత్రుల్లో భాగంగా వినాయక విగ్రహ శిల్పి కోడూరు సాయితేజ దంపతులను శాలువా, గణపతి చిత్రపటంతో గురువారం రాత్రి ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం సబ్బు బిల్లలతో వినాయక విగ్రహాన్ని రూపొందించి, పట్టణ వాసులను సాయి ఆకట్టుకున్నాడని ప్రశంసించారు. కార్యక్రమంలో వినాయక పందిరి సభ్యులు కాండ్రేగుల రాజు, ముదుర్తి భాను, కరుణాకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.